క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మచెరువు పంచాయతీ మారుగానిపల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ నరసింహుడు సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం చేలూరు నుంచి కందుకూరు వైపు వస్తున్న బస్సును తనిఖీ చేయగా ములకలచెరువు మండలం కాలువపల్లి పంచాయతీ కాయలవారిపల్లికి చెందిన రవీంద్ర (37) అనే వ్యక్తి రూ.3,339ల విలువ చేసే కర్ణాటక మద్యంతో పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంగళవారం పేర్కొన్నారు.

బియ్యం, లడ్డూ వితరణ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు వినాయక చవితి సందర్భంగా మరోసారి దాతృత్వం చాటుకున్నారు. ఈ నేపథ్యంలో సభ్యులైన మిండిగళ్ళు లక్ష్మణ్, శ్రావణి, డాక్టర్ శ్రీకాంత్‌లు కలసి రెండు వినాయక మండపాల వద్ద 10 ప్యాకెట్ల బియ్యం, 21 కిలోల లడ్డూను అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ మంగళవారం పేర్కొన్నారు.

హెల్పింగ్‌మైండ్స్‌కు సేవా రత్న అవార్డు

మదనపల్లె సిటీ : సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సంస్థకు బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 14న బెంగళూరులో జరిగే కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సంస్థ నిర్వాహకులు అబూబకర్‌సిద్దిక్ అవార్డును అందజేయనున్నారు. ఈ విషయాన్ని మంగళవారం అబూబకర్ తెలియజేశారు. సామాజిక సేవలో విశేష కృషి, స్వచ్ఛంద సేవకులకు, సమాజానికి సేవ చేసిన వారిని గుర్తించి అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

'పట్టు'లేని గ్రామసభలు

పెద్దతిప్పసముద్రం : పట్టు పరిశ్రమ శాఖకు చెందిన అధికారులు మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. మల్బరీ సాగు వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వం ద్వారా రైతులకు మంజూరయ్యే రాయితీ పథకాలు,వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి క్షుణ్ణంగా వివరించాలి. అలా కాకుండా ఈ శాఖలో పని చేసే పలువురు క్షేత్ర స్థాయి సిబ్బంది రైతులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా హడావుడిగా వచ్చి సచివాలయాకు వచ్చే ప్రజలను అక్కడే కాసేపు ఉండమని చెప్పి కుర్చీల్లో ఆసీనులయ్యేలా చేసి గ్రామసభలు తూతూ మంత్రంగా అయిందని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. సంబంధిత డివిజన్ స్థాయి అధికారులు ఇకనైనా గ్రామసభలు సక్రమంగా జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మేరీ క్యూరీ ఫెలోషిప్‌కు ఎంపిక


టింకూనాయక్

పీలేరు : ఐరోపాలో ప్రతిష్టాత్మకమైన స్కాలర్‌షిప్ అయిన పీహెచ్‌డీ కోసం కేవీపల్లె మండలం దిగువగల్లుకు చెందిన టింకూ నాయక్ మేరీ క్యూరీ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు. దిగువగల్లులో నిరుపేద కుటుంబానికి చెందిన చిట్టేనాయక్ కుమారుడు టింకూనాయక్ ప్రభుత్వ పాఠశాలలో 2015లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తి చేసిన టింకూ నాయక్ దక్షిణ కొరియాలోని సోగాంగ్ విశ్వ విద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేశారు. దీంతో కొరియా ప్రభుత్వ పూర్తి నిధులతో కూడిన స్కాలర్‌షిప్ కోసం మేరీక్యూరీ ఫెలోషిప్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేసింది. 2024 అక్టోబర్ నుంచి జర్మనీలోని కీల్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేయనున్నారు. దీనికి గానూ ఆయనకు నెలవారీ స్టైఫండ్ 3000 యూరోలు (రూ. 3 లక్షలు) అందుతుంది. టింకూ నాయక్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వార్డుమెంబర్లు, పారిశుద్ధ్య కార్మికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్యం కొరవడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చూడాలన్నారు. విద్యుత్ వీధి దీపాల సమస్య లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో వార్డు మెంబర్లు స్టాంపుల నరసింహారెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, సాంబశివారెడ్డి, కాలేషా, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ములకలచెరువు: అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టడంతో చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు.. ములకలచెరువు నుంచి బురకాయలకోటకు ప్రయాణికులతో వెళుతున్న ఆటో పెద్దపాల్యం సమీపంలో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో దేవళ్ళచెరువుకు చెందిన అంకిత (5కు) తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో మొలకలుచెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

20న మండల మీట్

బి.కొత్తకోట : ఈనెల 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ శంకరయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు. ప్రభుత్వశాఖల అభివృద్ధిపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు.

సమావేశాలు అడ్డుకోవడమే ప్రజాపాలనా?

- ప్రజా సమస్యల పరిష్కార వేదిక మండల పరిషత్
- టీడీపీ శ్రేణుల అడ్డగింత, కార్యాలయాలకు తాళాలు


ములకలచెరువు మండలమీట్‌కు హాజరై కార్యాలయం ఎదుట ప్రజాప్రతినిధులు(ఫైల్)

బి.కొత్తకోట: కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు పదేపదే పలుకుతున్న మాట కూటమిది ప్రజాప్రభుత్వమని, ప్రజాపాలనను అందిస్తున్నామని అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితుల మాటేలా ఉన్నా తంబళ్లపల్లె నియోజకవర్గంలో మాత్రం ప్రజాపాలనకు అర్థం మారిపోయింది. మండల స్థాయిలో ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం, అభివృద్ధి చర్యలపై నిర్ణయం తీసుకునే వేదికైన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాలను కూటమి నేతలు అడ్డుకోవడం, ఉద్రిక్తలు సృష్టించడమే ప్రజాపాలనా అని ప్రజలు నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సర్వ సభ్య సమావేశాలు నిర్వహించారు. కోరం ఉన్నా, అధికారులు హజర్రైనా పెద్దతిప్పసముద్రం, ములకలచెరువుల్లో కూటమి నేతలు అడ్డుకోవడంతో వాయిదాలు వేశారు. అన్ని మండల పరిషత్‌లు వైఎస్సార్‌సీపీవే కావడంతో సమావేశాలను జరగనివ్వబోమని శపథాలు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మండల పరిషత్ చరిత్రలో జరగడం ఇదే ప్రథమం. మిగతా మండలాల్లోనూ ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులే నెలకొన్నాయి.

అలజడి రేపి కోరం లేదని నాటకాలు

పెద్దతిప్పసముద్రం మండల సమావేశాన్ని జూలై 23న నిర్వహిస్తున్నట్లు అధికారులు ఆదేశాలు జారీచేసినా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయ ఘటనతో ఆగస్టు ఏడుకు వాయిదా వేశారు. ఆరోజు ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు కోరం ఉన్నా అధికారులు శాంతి భద్రతల సమస్య అంటూ సమావేశం జరపలేదు. కార్యాలయం వద్దకు చేరుకున్న కూటమి నేతలు సమావేశం జరగరాదంటూ అడ్డుపడ్డారు. ఉద్రిక్త పరిస్థితి సృష్టించారు. అలాగే ములకలచెరువులో గతనెల 28న నిర్వహించిన మండల పరిషత్ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరయ్యారు. సమావేశ నిర్వహణకు సమస్యలేనప్పటికి బయట కూటమి నేతలు కార్యాలయం గేటుకు తాళం వేసి సమావేశం నిర్వహించొద్దని ధర్నా చేస్తే అధికారులు వంతపాడుతూ వాయిదా వేశారు.

ఎస్‌ఐలు లేరని వాయిదా అట..

పోలీసుల బందోబస్తుతో మండల సమావేశాలు జరిగింది లేదు. ఇప్పుడేమో అధికారులు ఎస్‌ఐలు లేనందున సమావేశాలు వాయిదా వేస్తున్నామని కొత్త పాట పాడుతున్నారు. పెద్దమండ్యంలో గతనెల 29 సమావేశ నిర్వహణకు నిర్ణయించి ఎంపీడీఓ ఉత్తర్వు జారీ చేయగా ఒకరోజు ముందు వాట్సాప్ సందేశం పంపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఎస్‌ఐ లేనందున వాయిదా వేసినట్టు ప్రకటించారు. తంబళ్లపల్లెలోనూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. ఈనెల 5న సమావేశం నిర్వహించాల్సి ఉండగా బందోబస్తు ఇవ్వలేమని పోలీసులు చెప్పడంతో వాయిదా వేసినట్టు ఎంపీడీఓ ప్రకటించారు.

కురబలకోటలో భయాందోళన:

కురబలకోట మండల పరిషత్ సమావేశాలు జరగకుండా కూటమి నేతలు అడ్డుపడటమే కాక హెచ్చరికలు చేయడం భయాందోళనలకు గురి చేశాయి. జూలై 12న సమావేశం నిర్వహణ ప్రకటించగా కూటమి నేతలు అడ్డుకుంటామని చెప్పడంతో ఎంపీపీ సహా సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు. మళ్లీ 19న తేది మండల మీట్ నిర్వహించగా కొందరు ఎంపీటీసీలు హాజరైనా కోరంలేక వాయిదా వేశారు.

అభివృద్ధి పై ప్రభావం

సమావేశాలు నిర్వహణ జరగకుంటే మండలాల్లో అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. నిధుల వినియోగంపై మండల పరిషత్ తీర్మానం ముఖ్యం. సమస్యలపై చర్చించి అభివృద్ధి పనుల మంజూరు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటారు. సమావేశాలు వాయిదా వేసుకుంటూపోతే ప్రజలపై ప్రభావం చూపుతుంది.

వైభవంగా కుంభాభిషేకం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సంప్రోషణ, కుంభాభిషేకం కార్యక్రమాలను టీ.ఎస్.కుటుంబీకులు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం పూజ కార్యక్రమాలు ప్రారంభించారు. మంగళవారం టీ.ఎస్.విజయనారాయణరెడ్డి, శోభ దంపతులు, హర్షారెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు లక్ష్మణస్వామి బృందంతో మహాగణపతి పూజ, గంగపూజ, గో పూజ, పంచగవ్వ ప్రార్థన, రక్షాబంధనం, ప్రధాన కలశస్థాపనం, సాయంత్రం మూలమంత్ర జపాదులు, వేదస్వస్తి, మహామంగళహారతి నిర్వహించారు. ఆలయం ముందు అగ్నిహోమం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు టీ.ఎస్.ప్రమీలమ్మ,దినకర్‌రెడ్డి, లాసికారెడ్డి పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదవేంద్ర

కేవీపల్లె : మండలాభివృద్ధికి సమష్టి కృషితో పని చేయాలని ఎంపీడీఓ యాదవేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పారిశుద్ధ్య, ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చురుగ్గా చేపట్టాలన్నారు. మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొందరు సర్పంచ్‌లు మాట్లాడుతూ ఉపాధిలో ప్రజలకు, కూలీలకు అనుకూలమైన పనులు కల్పించాలని కోరారు. గతంలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, హరిబాబు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ముందుచూపు లేకనే అపారనష్టం

- బాధితులను ఆదుకోవడంలోనూ విఫలం
- సాయం కొంత.. ప్రచార ఆర్భాటమే ఎక్కువ
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు : విజయవాడలో వరదల పట్ల కూటమి ప్రభుత్వానికి ముందు చూపు లేకనే అపారనష్టం వాటిల్లిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ నగరవాసులను వరదలు వస్తాయని అప్రమత్తం చేయడంలోనూ, వరదల అనంతరం ఆదుకోవడంలోనూ రెండు విధాలా రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని పేర్కొన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రినని, 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, ముందు చూపుతో రాష్ట్రాన్ని నడిపిస్తానని పేర్కొనే చంద్రబాబు పూర్తిగా విఫలం చెందారని తెలిపారు. అధికారులు అత్యధిక వర్షపాతం నమోదు కావడంతోపాటు వరద ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించినా రాష్ట్ర పాలకులు స్పందించకపోవడం విచారకరమని తెలిపారు. వరదలు వచ్చి అందులో ఇళ్లు మునిగిపోయినా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకపోవడం బాధాకరమని చెప్పారు. టీడీపీ నాయకులు పబ్లిసిటీ కోసం ప్రజలకు సాయమందించినట్లు హడావిడి చేశారు, తప్ప వాస్తవంగా వరద బాధితులకు న్యాయం చేయలేకపోయారని తెలిపారు. ప్రజలకు తాగునీరు, భోజనం తోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంలోనూ, పునరావాస కేంద్రాలకు తరలించడం లోనూ పూర్తిగా విఫలం అయినట్లు చెప్పారు. వరదలు వచ్చి పది రోజులు అయినా ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరద నీటిలో ప్రజలు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తుండడం బాధాకరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే విజయవాడ ప్రజలు అపార నష్టం చవిచూశారని తెలిపారు. వరదలతో నష్టపోయిన ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముప్పుందు విజయవాడ ప్రజలు వరదల్లో చిక్కుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు


మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్

వాల్మీకిపురం : సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఏటా రెండు లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా పది లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. 15–19 ఏళ్ల మధ్య ఉన్న యువతలో మరణానికి ప్రధాన కారణం ఆత్మహత్య అని తెలిపారు. ఎవరితో మాట్లాడకుండా ఉండటం, ఫోన్లు తీయకపోవడం, డిప్రెషన్‌లో ఉండటం తమను తాము ఇతరులపై భారంగా భావించడం ఒంటరిగా గడపడం వంటి వాటిని మనం హెచ్చరికలుగా భావించాలన్నారు. చావు ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం కాదని, ఏ సమస్య ఎదురైనా బతికే సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, వైస్ ప్రిన్సిపల్ రామలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరి, సలోమి, క్రిష్ణవేణి, ధనలక్ష్మమ్మ, సింధు, సత్యమ్మ, శోభన, గౌతమి, రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు పనితీరు మెరుగు పరచుకోవాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ అధికారులు

పెద్దతిప్పసముద్రం : విధి నిర్వహణలో అధికారులు పనితీరును మెరుగు పరచుకోవాలని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ సూచించారు. మంగళవారం ఈఓఆర్డీ యోగానంద్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ తిరుపాలప్పలు బృందాలుగా ఏర్పడి రంగసముద్రం, పీటీఎం గ్రామాల్లోని హౌసింగ్ లేఅవుట్లను ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలసి గృహాలను పరిశీలించారు. ప్రతి వారం ఇళ్ల పురోగతి వివరాలను తెలియజేయాలని ఎంపీడీఓ సూచించారు. మండలంలో 2348 గృహాలు మంజూరు కాగా 1155 గృహాలు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. గృహాలు మంజూరై ఇంకా పునాదులు కూడా వేయని లబ్ధిదారులు 34 మంది ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆ టీచర్ మాకొద్దు

కలకడ : గతంలో సస్పెండ్ అయి, బదిలీ అయిన టీచర్ మా పాఠశాలకు అవసరం లేదని పాఠశాలకు తాళం వేసి పిల్లల తల్లిదండ్రులు మంగళవారం నిరసన తెలిపారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముడియంవారిపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒక ఉర్దూ టీచర్, ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తూ ఉండగా ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఒక ఉపాధ్యాయుడిని బయటకు పంపి, ఆ టీచర్ స్థానంలో అదే పాఠశాలలో గతంలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయురాలిని నియమించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆటీచర్‌ను కొనసాగిస్తే మా పిల్లలకు టీసీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల చైర్మన్ చిదంబర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పాత ఉపాధ్యాయులే కావాలని ధర్నా

మదనపల్లె సిటీ : స్థానిక క్రిష్ణానగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పాత ఉపాధ్యాయులను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పేరెంట్స్ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మనాయక్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో పనిచేసిన అపర్ణ, శాలిని ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు.గతంలో 15 మంది పిల్లలు ఉండగా నేడు 75 మంది పిల్లలు ఉన్నారన్నారు. సర్దుబాటు ప్రక్రియ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులను మరొక పాఠశాలకు బదిలీ చేయడం సరికాదన్నారు.

హౌసింగ్ కాలనీలో అక్రమ కట్టడాల తొలగింపు

మదనపల్లె : మండలంలోని వలసపల్లె కొత్త హౌసింగ్ కాలనీలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు, పునాదులను తొలగించినట్లు హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు తెలిపారు. మంగళవారం వీఆర్వో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బందితో కలిసి వలసపల్లె హౌసింగ్‌కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగులు అక్రమంగా లేఅవుట్‌లో ఇంటి స్థలాలను పొంది నిర్మాణాలు చేశారని వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపారు. కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి అక్రమమని తేలడంతో ఓ ఇంటిని, పునాదుల వరకు చేసిన మరో నిర్మాణాన్ని తొలగించామన్నారు






మేపీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న పశువైద్యాధికారి సునీల్ నాయక్

గుర్రంకొండ : పీఎంఈజీపీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సునీల్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లెలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం కింద మేకలు, గొర్రెలు పెంపకం, పాడిపశువుల పెంపకం వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గొర్రెలు, మేకల పెంపకం కోసం రూ. 2లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు యూనిట్ ఉందన్నారు. ఈపథకం కింద దరఖాస్తు చేసుకొనేవారికి రైతులకు 25శాతం, మహిళా రైతులకు 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. రెండు పాడిఆవుల యూనిట్లకు రూ. 2లక్షల వరకు బ్యాంకుల్లో రుణం ఇస్తారన్నారు. ఇందులో కూడా 3 5శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. గొర్రెలు, మేకల పెంపకంకు ముందుగా షెడ్లు నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు. పశుసంవర్థక శాఖ, బ్యాంకు అధికారులు షెడ్లను పరిశీలించి రుణాలు మంజూరుకు సిఫార్సు చేస్తారన్నారు. ఆసక్తి గల రైతులు ఆన్‌లైన్ ద్వారా గానీ, బ్యాంకు అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతిచెందిన విద్యార్థి తల్లికి నగదును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దమండ్యం : వినాయక నిమజ్జనం కోసం వెళ్లి ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో మృతిచెందిన విద్యార్థి కుటుంబ సభ్యులకు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రూ. 15 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. పాపేపల్లె పంచాయతీ పి.తురకపల్లెకు చెందిన అఫ్జల్ (11) ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం పూర్తి కావడంతో విద్యార్థి మృతదేహాన్ని స్వగ్రామానికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే సూచనల మేరకు మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, మునలికుంట సుబ్బారెడ్డి, రామిరెడ్డి, పీరన్నలు విద్యార్థి తల్లి ఆలంబీకి రూ. 15 వేల నగదును మంగళవారం అందజేశారు.

జీఓ 115ను రద్దు చేయాలని నిరసన

మదనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 115 జీఓను రద్దుచేయాలని కోరుతూ సర్వజన బోధనాసుపత్రి ఎదుట నర్సింగ్ సిబ్బంది మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, 115 జీఓ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...14 ఏళ్లుగా ఉద్యోగభద్రత లేకున్నప్పటికీ, చాలీచాలని జీతాలతో నర్సింగ్ విధులు నిర్వహిస్తుంటే...తమ సేవలను ప్రభుత్వం గుర్తించకపోగా తమకు అన్యాయం చేసేలా జీఓను తీసుకురావడం అన్యాయమన్నారు. ఈ జీఓ కారణంగా కాంట్రాక్ట్ బేసిస్‌లో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికై నా ప్రభుత్వం తమ సేవలను గుర్తించి, నర్సింగ్ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నియామకాల్లో కాంట్రాక్ట్ బేసిస్‌లో పనిచేసిన వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సుహాసిని, రిజ్వానా, అన్నపూర్ణ, శివకుమారి, మధుప్రియ, ఎస్తర్‌రాణి, రేఖ, వనజ, వనిత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జన వేడుక

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక బజారువీధి, బలిజగడ్డ, ఇందిరమ్మకాలనీలో కొలువు దీర్చిన స్వామివారి విగ్రహాని వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలం నిర్వహించారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మధురామచంద్రుడు బందోబస్తు చర్యలు చేపట్టారు. అనంతరం సమీప చెరవుల్లో స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కేవీపల్లె : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గణేష్ ఉత్సవాలకు పూజలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

మదనపల్లె సిటీ : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం గ్రామ జ్యోతి స్వచ్ఛంద సంస్థ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి స్థాపనపై ప్రతిజ్ఞ చేశారు. యువత ముందుకు వచ్చి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజుకు ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. గ్రామజ్యోతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సుభద్ర, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు శ్రీదేవి, మాలతి, రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలపై నివారణపై విద్యార్థులకు అవగాహన

కలికిరి : ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ సమన్వయాధికారి చంద్రశేఖర్, మానసిన వైద్యులు డాక్టర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ సాధారణంగా 15 నుంచి 29సంవత్సరాల లోపు వయస్కులు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడతారని సర్వేలున్నాయన్నారు.

